జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 6 | జనవరి | 2026 • పేజీలు : 5

## కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరెయ్యాలి

### ఎంపీ రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో భారీ చేరికలు



**కొత్తగూడెం,జనవరి 5 (ప్రజాజ్యోతి):** కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మూడు రంగుల జెండా ఎగురవేయాలని ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి కోరారు. సోమవారం కొత్తగూడెంలోని

మిగతా 2 లో...

## సీఎం కప్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 5, ప్రజా జ్యోతి:** సీఎం కప్ క్రీడా పోటీలను జిల్లాలో విజయవంతంగా, నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సీఎం కప్ క్రీడా పోటీల నిర్వహణపై క్లస్టర్ ఇన్చార్జిలు , ఎంఈఓ లు , డీఈవో , డిపిఓ సంబంధిత శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించడమే సీఎం కప్ క్రీడా పోటీల ప్రధాన లక్ష్యమని తెలిపారు. సీఎం కప్ క్రీడా పోటీలు ఐదు దశలుగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామ పంచాయతీ స్థాయి పోటీలు ఈ నెల 17 నుండి 22 వరకు, మండల స్థాయి పోటీలు ఈ నెల 28 నుండి 31 వరకు, నియోజకవర్గ స్థాయి పోటీలు ఫిబ్రవరి 3 నుండి 7 వరకు, జిల్లా స్థాయి పోటీలు ఫిబ్రవరి 10 నుండి 14 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నాలుగు దశల పోటీల్లో గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొనే అర్హత పొందుతారని తెలిపారు, రాష్ట్ర స్థాయి పోటీలు ఫిబ్రవరి 19 నుండి 26 వరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో

మిగతా 2 లో...



## జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

### ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

**భద్రాచలం, జనవరి 5, ప్రజాజ్యోతి :** జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు ఘనంగా ప్రారంభమైనట్లు భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు . రోడ్డు ప్రమాదాలను నివారించడం, భద్రతా నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా పోలీసు శాఖ, రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించి, రోడ్డు ప్రమాదాల వల్ల జరుగుతున్న మరణాలను తగ్గించేందుకు చేపట్టిన జాతీయ స్థాయి కార్యక్రమమని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లోపం, వాటి ఉల్లంఘనల కారణంగా దేశవ్యాప్తంగా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, చాలామంది గాయాలపాలవుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో

మిగతా 2 లో...

## గిరిజన కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందాలి

### -
### వినతి పత్రాలు స్వీకరించిన ఐటీడీఏ పీవో బి. రాహుల్



**భద్రాచలం, జనవరి 5 , ప్రజాజ్యోతి :** మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాల్లో నివసించే అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ఐటీడీఏ ద్వారా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందేలా సంబంధిత యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన గిరిజన దర్బార్ కార్యక్రమంలో వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి వినతి పత్రాలను

మిగతా 2 లో...

## గంజాయి పట్టివేత



**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 5, ప్రజా జ్యోతి:** ఒరిస్సా నుంచి పాల్వంచ వైపుకు మూడు ద్విచక్ర వాహనాలపై గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, పాల్వంచ మండలంలోని కేశవాపురం పంచాయతీ కార్యాలయం ఎదురుగా బిసిఎం రహదారిపై ఎన్ ఫోర్స్ మెంట్ టీమ్ ఎస్సై శ్రీహరి రావు తన సిబ్బంది తో కలిసి సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలు లో భాగంగా భద్రాచలం నుండి ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై పాల్వంచ వైపుకు వస్తుండగా అనుమానస్పదంగా ఉన్న మూడు ద్విచక్ర ద్విచక్ర వాహనదారులను నిలిపి తనిఖీ చేశారు, ఈ తనిఖీ లో ఆ ముగ్గురు వ్యక్తుల నుండి

మిగతా 2 లో...

## గంజాయి పట్టివేత

(మొదటి పేజీ తరువాయి...)

మూడు లక్షల 50 వేలు విలువచేసే 7'4 కేజీల ఎండు గంజాయి ఉన్నట్లు ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గుర్తించారు, దీంతో ద్విచక్ర వాహనంపై వస్తున్న పాల్వంచకు చెందిన గొల్లపల్లి సాంబశివరావు, భూక్య శ్రీహరి, పోతుల చిన్నలను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి గంజాయిని, మూడు ద్విచక్ర వాహనాలను, మూడు సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులను పాల్వంచ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్కు అప్పగించారు, ఈ సందర్భంగా ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మాట్లాడుతూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులు ఒరిస్సా రాష్ట్రం నుండి పాల్వంచకు గంజాయిని సరఫరా చేస్తున్నారని తెలిపారు, గంజాయి రవాణా చేస్తున్న వారి వివరాలను తమకు తెలియజేస్తే వారి వివరాలను తాము గోప్యంగా ఉంచుతామని ఈ సందర్భంగా తెలిపారు, గంజాయి రవాణాని అడ్డుకొని యువతను సక్రమమైన దారిలో పెట్టేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా వహించాలని కోరారు, గంజాయిని పట్టుకున్న ఎన్ఫోర్స్మెంట్ అధికారులను ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జనార్దన్ రావు అసిస్టెంట్ కమిషనర్ గణేష్ ఏ ఈ ఎస్ తిరుపతి, లు వారిని అభినందించారు, ఈ తనిఖీ లో ఖమ్మం ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్ఐ శ్రీహరి రావు, హెడ్ కానిస్టేబుల్ కరీం, కానిస్టేబుల్స్ సుధీర్ ,వెంకట్, విజయ్ ,వీరబాబులు ఉన్నారు

## గిరిజన కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందాలి

(మొదటి పేజీ తరువాయి...)

స్వీకరించిన ఆయన, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా యూనిట్ అధికారులు కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు.గిరిజనులు సమర్పించిన వినతి పత్రాల్లో ప్రధానంగా పోడు భూముల పట్టాలు మంజూరు, భూ సమస్యల పరిష్కారం, వ్యక్తిగత సమస్యలు, పంట పొలాలకు సోలార్ విద్యుత్ కనెక్షన్లు, ట్రైకార్ ద్వారా అందించే సబ్సిడీ రుణాలు, కొత్తగా ఏర్పాటు చేయనున్న మత్స్యకార సొసైటీలకు సంబంధించిన సమస్యల పరిష్కారం తదితర అంశాలు ఉన్నాయని తెలిపారు.అలాగే వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ కనెక్షన్లు, బోర్లు, మోటార్లు, గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించడం, జీవనోపాధి పెంపొందించుకునేందుకు వ్యక్తిగత రుణాల మంజూరు కోసం కూడా వినతులు అందినట్లు పేర్కొన్నారు.గిరిజన దర్బార్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి, అర్హులైన గిరిజన కుటుంబాలకు విడతల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఏవో సున్నం రాంబాబు, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏపీఓ పవర్ వేణు, ఏడీఎం హెచ్ఓ సైదులు, డీటీఆర్వో ఎల్. లక్ష్మీనారాయణ, ఎఫ్‌డీసీ ఉదయ్ కుమార్, పీవీటీజీ అధికారి గన్యా, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ, హౌసింగ్ ఏఈ హేమంత్, అలాగే వివిధ శాఖలకు చెందిన విజయలక్ష్మి, భార్గవి, జోగారావు, మోహన్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, లింగా నాయక్ పాల్గొన్నారు

## స్కూల్ కాలేజీ బస్సుల తనిఖీలు





**కొత్తగూడెం,జనవరి 5 (ప్రజాజ్యోతి):**జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా కొత్తగూడెంలో స్కూలు, కాలేజీ బస్సుల తనిఖీలను ఎంవిఐ వెంకటరమణ, వన్ టౌన్ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ప్రతి వాహనాన కెపాసిటీని, వాహన కాగితాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని ఈ వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తగు జాగ్రత్తలను వాహనాల డ్రైవర్లు సిబ్బంది తీసుకోవాలని తెలిపారు. ప్రజలలో రోడ్డు భద్రతపై అవగాహన కోసం మరిన్ని కార్యక్రమాలను ఈ నెల 31 వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రీ టౌన్ ఎస్ఐ ఎం.కె బేగ్, కిషన్, సంజీవ్, అనంత రాములు, నరేష్ పాల్గొన్నారు.

# సీఎం కప్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

నిర్వహించనున్నట్లు వివరించారు.గ్రామస్థాయిలో సీఎం కప్ క్రీడా పోటీల నిర్వహణ కోసం జిల్లాను 77 క్లస్టర్లుగా విభజించినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామీణ స్థాయిలో కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పోటీలు సక్రమంగా నిర్వహించేందుకు ఎంఈఓలు, సీఆర్పీలు, పంచాయతీ సెక్రటరీలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములుగా చేసుకుని క్రీడలను విజయవంతం చేయాలని సూచించారు.నియోజకవర్గ స్థాయిలో వాలీబాల్, ఖో–ఖో, కబడ్డీ క్రీడలతో పాటు ఫుట్ బాల్ పోటీలను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో వివిధ రకాలైన మొత్తం 21 క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు.గ్రామీణ ప్రాంతాలలో సీఎం కప్ క్రీడా పోటీలపై విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని క్రీడల్లో పాల్గొనదలచిన వారు ఆన్ లైన్ ద్వారా నమోదు చేసుకునేలా అవసరమైన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్రీడాకారులు తమ వివరాలను అధికారిక వెబ్ సైట్ (satg.telangana.gov.in/cmcup) లేదా 'CM Cup' మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పాల్గొనే ప్రతి క్రీడాకారుడికి ప్రభుత్వం సర్టిఫికేట్లు అందజేస్తుందని అన్నారు.పోటీల నిర్వహణకు అవసరమైన మైదానాలను సిద్ధం చేయాలని, ప్రతి గ్రామంలో కనీసం రెండు మైదానాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక మైదానాన్ని బాలుర పోటీలకు, మరో మైదానాన్ని బాలికల పోటీలకు వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.గ్రామ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు మండల స్థాయికి, మండల స్థాయి నుంచి గెలుపొందిన వారు నియోజకవర్గ స్థాయికి, అక్కడి నుంచి జిల్లా స్థాయికి, అనంతరం రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ వివరించారు. సీఎం కప్ క్రీడా పోటీల్లో విద్యార్థులు, యువకులతో పాటు అన్ని వయసుల క్రీడాకారులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు.

## కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరెయ్యాలి

(మొదటి పేజీ తరువాయి...)

14వ, 19వ,30వ, 29వ,55వ, 56వ,58వ,59వ డివిజన్లలోని వివిధ ప్రాంతాలలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సన్నాహక సమావేశాలలో భాగంగా ఎంపీ సమక్షంలో రామవరంలోని 15వ డివిజన్ లో యువనాయకుడు రావుల సాయి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సాయికి ఎంపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావాలని, నిస్వార్థంగా సేవ చేయాలని, ప్రజల మెప్పు పొందేలా శ్రమించాలన్నారు.త్వరలో జరిగే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను తప్పక గెలిపించాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెం వ్యాప్తంగా అన్ని డివిజన్లో సన్నాక సమావేశాలు నిర్వహించి కాంగ్రెస్ కార్యకర్తలను దిశా నిర్దేశం చేయాలని నాయకులకు తెలిపారు . ప్రజా పాలనలో ప్రభుత్వం అందిస్తున్న ఫలాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లాలన్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెరుగైన ఫలితాలు సాధించడంలో కార్యకర్తలు, నాయకులు చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. అదే జోషుతో రానున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ వశం కావాలని ఆకాంక్షించారు.ఈ సమావేశంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగసీత రాములు, జిల్లా అధ్యక్షురాలు దేవి ప్రసన్న, మాజీ జెడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ, ఆళ్ళ మురళి, నాయకులు ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ రజాక్, మండే వీరహనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి...)

ఉంచుకుని వాహనదారులు, పాదచారులు, సైక్లిస్టులు రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ మాసోత్సవాల్లో భాగంగా భద్రాచలం పోలీసులు విస్తృత అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక తనిఖీలు, నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు పడుతున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీటుబెల్ట్ ధరించడం తప్పనిసరి అని, మద్యం సేవించి వాహనం నడపడం నేరమని స్పష్టం చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నిషేధమని, ఇందుకు తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.వాహనాల నంబర్ ఫలకాలు స్పష్టంగా కనిపించే విధంగా ఉండాలని, అక్షరాలు, అంకెలు మార్పులు చేయరాదని సూచించారు. స్టిక్కర్లు, చిహ్నాలు, దేవుళ్ల చిత్రాలు, అలంకార అక్షరాలతో ఫ్యాన్సీ నంబర్ ఫలకాలు వాడటం చట్ట విరుద్ధమని తెలిపారు. నంబర్ ఫలకాన్ని వంచడం, దాచడం, రంగు మార్చడం నేరమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని వాహనాలకు భద్రతా నంబర్ ఫలకం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. నంబర్ ఫలకం లేని, తప్పుడు లేదా చదవలేని నంబర్ ఉన్న వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.వాహనాలకు అనుమతించిన పరిమితులలోనే కాంతి దీపాలు అమర్చుకోవాలని, అద్దాలకు నలుపు ఫిల్మ్ వాడరాదని సూచించారు. అనుమతించిన వేగ పరిమితులలోనే వాహనాలు నడపాలని, అతివేగం మరియు నిర్లక్ష్య డ్రైవింగ్ నేరమని తెలిపారు. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు, హారన్లు వాడితే వాటిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తక్కువ కాంతి పరిస్థితుల్లో స్పష్టంగా కనిపించేందుకు ప్రతిఫలక పట్టీలు, వెనుక దీపాలు, భద్రతా పరికరాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. లేన్ క్రమశిక్షణ పాటించాలి, ఒకే దారిలో తప్పు వైపు వాహనం నడపరాదు, సంకేతాలను తప్పనిసరిగా పాటించాలి, వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించరాదని సూచించారు.చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ అనుమతి పత్రం కలిగి, యాంత్రికంగా సక్రమంగా ఉన్న వాహనాన్ని మాత్రమే నడపాలని తెలిపారు. అన్ని పాఠశాల బస్సులకు చెల్లుబాటు అయ్యే ఫిట్ నెస్ ధ్రువీకరణ, బీమా, అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. బస్సు ముందు, వెనుక భాగాల్లో పాఠశాల బస్సు అని స్పష్టంగా ఉండాలని తెలిపారు.బస్సు నడిపే వ్యక్తికి చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ అనుమతి పత్రం, తగిన అనుభవం ఉండాలని, పిల్లల సంఖ్యకు మించి బస్సులో ఎక్కించరాదని సూచించారు. బస్సులో ప్రథమ చికిత్స పెట్టె, అగ్నిమాపక పరికరం ఉండాలని తెలిపారు. బస్సు తలుపులు, కిటికీలు సక్రమంగా పనిచేసే స్థితిలో ఉండాలని, అటెండర్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.పిల్లలు ఎక్కే, దిగే సమయంలో బస్సును పూర్తిగా ఆపి భద్రత కల్పించాలని, బస్సు తలుపులు లేదా కిటికీల వద్ద పిల్లలు వేలాడేలా అనుమతించరాదని తెలిపారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో నిర్దేశిత వేగ పరిమితిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు.రోడ్డు మధ్య డివైడర్లపై అనధికారికంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు

# ఏరియాను సందర్శించిన రాష్ట్ర స్థాయి నిపుణుల అప్రైజల్ కమిటీ





**సింగరేణి కొత్తగూడెం, జనవరి 5 ప్రజాజ్యోతి:** సింగరేణి కొత్తగూడెం ఏరియాలో రాష్ట్ర స్థాయి నిపుణుల అప్రైజల్ కమిటీ సభ్యులు డాక్టర్ ఎ. వెంకట రాజశేఖర్, డాక్టర్ సరిత సజ్జ, దినేష్ కుమార్ భరత్రాజ్ లు అండర్‌గ్రౌండ్ బొగ్గు గనికి మంజూరైన పర్యావరణ అనుమతుల అమలును పరిశీలించుటకు కమిటీ సందర్శనకు విచ్చేశారు. ఈ సందర్భంగా ముందుగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు ఎస్ఈఏసి బృందంకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం పద్మావతి ఖని మేనేజర్ కార్యాలయంలో బొగ్గు ఉత్పత్తి, రవాణాకు సంబంధించిన మ్యాప్లను పరిశీలించారు. పద్మావతి ఖని మేనేజర్ బొగ్గు ఉత్పత్తి, రవాణాను వివరాలను వివరించడం జరిగింది. అనంతరం వారు అండర్ గ్రౌండ్ లో బొగ్గు ఉత్పత్తి చేయు పని ప్రదేశాలను సందర్శించడం జరిగింది. ఆ తర్వాత పద్మావతి ఖని లో ప్లాంటేషన్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ (ఎన్విరాన్మెంట్), బి. సైదులు, రాష్ట్ర స్థాయి నిపుణుల అప్రైజల్ కమిటీ సభ్యులు ఎ. వెంకట రాజశేఖర్, సరిత సజ్జ, దినేష్ కుమార్ భరత్రాజ్, ఎస్ఓటు జిఎం జీ.వి. కోటిరెడ్డి, సిహెచ్. అజాయే, పీసీబీ (స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు), పద్మావతి ఖని ఏజెంట్ రామ్ భరోస్ మహాతో, మేనేజర్ డాక్టర్ ఎం.వి.ఎన్ శ్యామ్ ప్రసాద్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ ఫోటోగ్రాఫర్ క్లాసిక్ షరీఫ్ 53వ జయంతి వేడుకలు

- అన్నదానం నిర్వహించిన మిత్రులు







**భద్రాచలం, జనవరి 5 ,ప్రజాజ్యోతి :** భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాల అపూర్వ సహజ సౌందర్యం, గిరిజన జీవనశైలిని తన కెమెరా కన్నుల ద్వారా బంధించి ప్రపంచ నలుమూలలకు పరిచయం చేసిన అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన ఫోటోగ్రాఫర్ క్లాసిక్ షరీఫ్ 53వ జయంతి సందర్భంగా ఆయన మిత్రులు భద్రాచలంలోని స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో అన్నదానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో కొనసాగుతున్న “వీల్స్ ఆన్ ఫ్రీ మీల్స్” సేవా కార్యక్రమంలో భాగంగా, మిత్రుల సహాయ సహకారాలతో ఈ అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వందలాది నిరుపేదలు, వృద్ధులు, ప్రయాణికులు భోజనం స్వీకరించి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో మిత్రులు జక్కిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రంజిత్ నాయక్ భూక్యా, కొప్పుల మురళి మాట్లాడుతూతమ మిత్రుడు క్లాసిక్ షరీఫ్ అకాలమృతి తమ జీవితాల్లో తీరని లోటుగా మిగిలిపోయిందని, ఆయన లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోటోగ్రఫీని వృత్తిగా మాత్రమే కాకుండా ఒక సామాజిక బాధ్యతగా భావించిన వ్యక్తి షరీఫ్ అని గుర్తు చేశారు. ప్రకృతి, ప్రజలు, సంస్కృతి పట్ల ఆయనకున్న ప్రేమ ఆయన చిత్రాల్లో ప్రతిబింబించేదని తెలిపారు.అలాగే, షరీఫ్ ఆశయాలను కొనసాగిస్తూ భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు చేపడతామని, యువతకు ప్రేరణగా నిలిచే కార్యక్రమాలను నిర్వహిస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం అధ్యక్షుడు కమల రాజశేఖర్, కార్యదర్శి సిద్ధారెడ్డి, క్లబ్ సభ్యులు భీమవరపు వెంకట్ రెడ్డి, బాలానర్స రెడ్డి, డా. కృష్ణప్రసాద్, జిందా, మమతా, సంతోష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి కల్వర్టు గోడకు ఢీకొని వ్యక్తి మృతి



**టేకులపల్లి,జనవరి05,ప్రజాజ్యోతి:** ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని నైన్త్ మేలు తండాలో సోమవారం చోటుచేసుకుం ది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందు నుండి నైన్త్ మేలు తండకు వ స్తున్న క్రమంలో ఆరో మేల్ అటవీ ప్రాంతంలో కల్వర్టు గోడను ఢీకొని గుగులోత్ అశోక్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

## శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో వైభవంగా ఏకాదశ రుద్రాభిషేకాలు

- సోమవారం సందర్భంగా మహాన్యాస పూర్వక అభిషేకాలు, అనంతరం అన్నదాన కార్యక్రమం





**అన్నపురెడ్డిపల్లి, జనవరి 5, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో సోమవారాన్ని పురస్కరించుకుని మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమా లు ఘనంగా జరిగాయి.అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని హెచ్ సీఎస్ కంపెనీ సీతారామ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కేశవ రాజు సత్యనారాయణ, గోపిరాజు కుటుంబీకులు నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తు లు మహాప్రసాదాన్ని స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ మేనేజర్ పి.వి. రమణ, ఆలయ చైర్మన్ మల్లెల నరసింహారావు, పాలక మండలి సభ్యులు పాల్గొని కార్యక్రమాల నిర్వహణకు సహకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు

## వనదేవతలను దర్శించుకున్న ఐఎన్టీయూసీ నాయకులు





**కొత్తగూడెం సింగరేణి, జనవరి 5 – ప్రజాజ్యోతి:** ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో తెలంగాణ వన జాతర , తెలంగాణ రాష్ట్రంలో కుంభమేళాగా పిలుచుకునే జాతర వన దేవతలు సమ్మక్క సారలమ్మ అమ్మవార్లకు తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ , ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, కేంద్ర కమిటీ , సింగరేణి అన్ని ఏరియాల నాయకులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సత్తుపల్లి నుంచి తీగల క్రాంతికుమార్ ఐఎన్టియుసి నాయకులతో కలిసి సోమవారం అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్మికులు , కుటుంబ సభ్యులు , బంధు మిత్రులు , శ్రేయోభిలాషులపై సమ్మక్క సారలమ్మ అమ్మవార్ల దీవెనలు ఉండాలని కోరుకున్నామని తెలియజేసిన తీగల క్రాంతికుమార్.ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లు త్యాగరాజన్ , నరసింహారెడ్డి , ధర్మపురి , కంపేల్లి సమ్మయ్య , జెట్టి శంకర్రావు , సత్తుపల్లి ఐఎన్టియుసి ఫిట్ సెక్రటరీలు బాలాజీ , పోగుల నాగేశ్వరరావు , నాయకులు ప్రసన్న , సురేష్ , శ్రీధర్ , రషీద్ ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన





**ఇల్లందు, జనవరి 5, ప్రజాజ్యోతి:** మండలంలోని సిఎస్పీ బస్తీ గ్రామ పంచాయతీలోని 1వ వార్డు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సోమవారం సర్పంచ్ మోకాళ్ళ లావణ్య కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పెళ్లయిన అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాకూబ్ ఖాన్, వార్డ్ నెంబర్లు ఆలం సారిక, గరిగ నాగమణి, పినబోయిన వెంకటేశ్వర్లు, పొడుగు ఎల్లబాయ్, ఎస్.కె. పాషా, వీరబోయిన లక్ష్మి,కాంగ్రెస్ పార్టీ నాయకులు కుడితి శ్రీనివాస్, మేరీ, పాకలపాటి సాగర్, దయ్యాల మల్లయ్య, రాజేశ్వర్, మారపల్లి రవీందర్, కోటమ్మ, మూతి దశరథి, యండి ఘని, అంజి, ఎర్రబెల్లి రాజశేఖర్, ఈశ్వర్, భుక్య సక్కు బాయ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## మాలలు రాజకీయాల్లోకి రావాలి

- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్



**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 5, ప్రజా జ్యోతి:** మాలలు రాజకీయాల్లోకి వచ్చి,రాజకీయాల్లో రాణించాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ అన్నారు.సోమవారం పట్టణంలోని కొమరం భీం భవన్ లో మాలల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఆర్ఎస్ఎస్ మతోన్మాద బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్రలు చేస్తుందని,బీజేపీ ప్రభుత్వం త్వరలోనే ప్రజాస్వామ్యం స్థానంలో మనువాదాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నం చేస్తోందని,అదే జరిగితే 93 శాతం ఉన్న ప్రజలు గతంలో మాదిరిగా మళ్లీ బానిసలుగా మార్చే కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.మతోన్మాద విధానాలను అమలు చేయడానికి ఇచ్చే ప్రాధాన్యత ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఇవ్వడం లేదని,దేశ సంపదను కొల్లగొట్టి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి ప్రాధాన్యత ఇస్తుందని విమర్శించారు. ప్రతీ ఇంట్లో రాజ్యాంగం ఉండాలని,ప్రతీ ఒక్కరూ రాజ్యాంగాన్ని చదవాలని, రాజ్యాంగ రక్షణ కోసం గ్రామ స్థాయి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు.ఈదేశంలో మనల్ని కాపాడుకున్నది భారత రాజ్యాంగమేనని ,కానీ రాజ్యాంగం పైన అవగాహన లేక రాజ్యాంగం ద్వారా వచ్చిన హక్కులను తెలుసుకోలేక పోవడంవల్లనే మనువాదులు రాజ్యమేలుతున్నారని ,అణగారిన వర్గాల ప్రజలు ఏరోజైతే భారత రాజ్యాంగ విలువను,ఓటు విలువను గుర్తిస్తారో ఆరోజు ఖచ్చితంగా రాజ్యాధికారాన్ని సాధిస్తారని,మనువాదుల ఉచ్చులో పడకుండా ఈదేశానికి పాలకులవుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో మాలల ఐక్య వేదిక కన్వీనర్ రిటైర్డ్ ఇంజనీర్ బరగడి దేవదానం,కో–కన్వీనర్ సింగరేణి రిటైర్డ్ జీ.ఎం. శనగ వెంకటేశ్వర్లు,అడ్వకేట్ డి.శోభారాణి,మాలమహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి శేఖర్,రమణమూర్తి, ఇన్నయ్య,రిటైర్డ్ మండల విద్యాశాఖధికారి ఫ్రాన్సిస్,రిటైర్డ్ ప్రిన్సిపాల్ గుర్రం లక్ష్మయ్య, వి.శ్రీనివాస్ రావు,అసిస్టెంట్ ప్రొఫెసర్ బలరాం,ప్రిన్సిపాల్ దాసరి రమేష్,జూనియర్ లెక్చరర్ వరద ప్రభాకర్,రిటైర్డ్ ఉద్యోగులు శనగ స్వామి,గడ్డం రాఘనబాబు,వ్యాపారవేత్తలు ఇస్సాక్,ఉండేటి శాంతివర్ధన్,ప్రైవేట్ ఉద్యోగస్థులు ఎం.వి.రమణ,పంతగానిరాజశేఖర్,పోతురాజు బాబు,ఎస్.కమలాకర్,నామ ప్రసాద్,దుమల మధు పాల్గొన్నారు.


## ఐఈడి పేలి యువకుడికి గాయాలు



**చర్ల, జనవరి 05 (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో, నక్సలైట్లు అమర్చిన ఐఈడి పేలి ఒక గ్రామీణ యువకుడి కాలికి తీవ్రముగా గాయాలయ్యాయి. ఈ సంఘటన తర్వాత అతనికి కోర్చోలిలోని 222 వ బెటాలియన్ సి ఆర్ పీ ఎఫ్ క్యాంప్‌లో ప్రథమ చికిత్స అందించిన తరువాత తదుపరి చికిత్స కోసం బీజాపూర్ ఆసుపత్రికి తరలించారు.నివేదికల ప్రకారం కొర్చోలి నదిపారా గ్రామంలో నివసించే 15 ఏళ్ల దివంగత లచ్చు పోటం కుమారుడు రామ్ పోతం సోమవారం తెల్లవారుజామున లేంద్ర–కొర్చోలి అటవీ ప్రాంతంలో వెళ్లాడు. మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ ఐఈడీ బాంబు పేలి అతను తీవ్రంగా గాయపడ్డాడు.మావోయిస్టులు అమర్చిన ఐఈడీలను గుర్తించి, వాటిని నిష్క్రియం చేయడానికి భద్రతా దళాలు నిరంతరం నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మర సోదాలు నిర్వహిస్తున్నాయి, గ్రామస్తులకు లేదా భద్రతా దళాలకు ఎటువంటి హాని జరగకుండా చూసుకుంటున్నారు. అయితే నక్సలైట్లు వివిధ ప్రదేశాలలో పెద్ద సంఖ్యలో ఐఈడీలను అమర్చారు, దీనివల్ల అనేక మంది గ్రామస్తులు సైనికులు గాయపడుతున్నారు .అడవులు ప్రవేశించలేని ప్రాంతాలలో ప్రయాణించేటప్పుడు అదనపు జాగ్రత్తగా ఉండండి అని ఏదైనా అనుమానాస్పద వస్తువు, కార్యకలాపాలు లేదా సామగ్రి గురించి వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్ లేదా భద్రతా శిబిరానికి తెలియజేయండి అని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు .

# పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులతో జీఎం సమీక్ష





**కొత్తగూడెం సింగరేణి, జనవరి 5 ప్రజాజ్యోతి:** సింగరేణి ప్రధాన కార్యలయ జిఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ ఛాంబర్ నుండి జనరల్ మేనేజర్ (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధిపతులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భముగా ఏరియాల వారీగా పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులతో పెండింగ్ లో ఉన్న కారుణ్యనియామకాల గురించి, కారుణ్య నియామకం ద్వారా తమ వారసులకు ఉద్యోగాలు ఇచ్చిన మాజీ ఉద్యోగుల వివరాలను ఈపిఆర్ నందు నమోదు చేసే ప్రక్రియ, క్వార్టర్స్ యొక్క స్థితిగతులు, నెలవారి క్వార్టర్ల కౌన్సెలింగ్ విధానం, గ్రాట్యుటీకి సంబంధించిన విషయాల గురించి సమీక్షించి, కారుణ్య నియమకాలు, టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపుల ప్రక్రియలను కూడా వేగవంతం చేయాలని నెలవారిగా కారుణ్య నియమకాలు, క్వార్టర్ కౌన్సిలింగ్, గ్రాట్యుటీ కి సంబంధించిన నివేదికలను సకాలంలో పంపించాలని అన్నారు. ఉద్యోగుల సంక్షేమం కి సంబందించిన అంశాలలో ఎటువంటి జాప్యం చేయకుండా నిబంధనలనుసరించి త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు.అదే విధముగా ఇప్పటివరకు సిఎంపిఎఫ్ / సిపిఆర్ ఎంఎస్ లకు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించని సింగరేణి మాజీ ఉద్యోగులు వెంటనే అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమములో డిజిఎం(పర్సనల్) లు బి.శివ కేశవ రావు, ముకుంద సత్య నారాయణ, డివై.పిఎం కే.సునీల్ కుమార్, సీనియర్ పిఓ ఎం.శ్రీనివాస్, కమ్యూనికేషన్ ఆఫీసర్ ఎన్.సుజ్ఞాన్, అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లిలో ట్రాఫిక్ నియమాల అమలుపై పోలీసుల దృష్టి

- స్కూల్ వాహనాలపై ప్రత్యేక నిఘా
- భద్రతా ప్రమాణాల పరిశీలన




**అన్నపురెడ్డిపల్లి, జనవరి 05, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో వాహనాల భద్రతను పటిష్టం చేసే లక్ష్యంతో ఎస్సై విజయ్ సింహ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది విస్తృత స్థాయి వాహన తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా పాఠశాలలకు సంబంధించిన వాహనాలను కేంద్రంగా చేసుకుని తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా డ్రైవర్లను అప్రమత్తం చేస్తూ పిల్లల ప్రాణ భద్రతకు సంబంధించి తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలపై సూచనలు ఇచ్చారు. వాహనాల తనిఖీలో డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ), ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తదితర పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు.అలాగే వాహనాల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ఎమర్జెన్సీ ఎగ్జిట్ సదుపాయాలు, కిటికీలకు గ్రిల్స్, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి భద్రతా అంశాలను కూడా పరిశీలించారు. డ్రైవర్, హెల్పర్ పూర్తి వివరాలు నమోదు చేసి, మత్తు పదార్థాల వినియోగం లేకుండా ఉన్నారా అనే అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించారు.వాహన నంబర్ ప్లేట్లు స్పష్టంగా లేకపోవడం, వేగపరిమితిని ఉల్లంఘించడం, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను వినియోగించడం వంటి సందర్భాల్లో కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అవసరమైతే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రైవేట్ వాహనాలను అక్రమంగా స్కూల్ వాహనాలుగా మారుస్తూ పిల్లల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టకూడదని సూచించారు. ఈ తనిఖీలు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామని, రోడ్డు భద్రతను మెరుగుపరచడం, ప్రమాదాలను తగ్గించడమే ప్రధాన లక్ష్యమని ఎస్సై విజయ్ సింహ రెడ్డి తెలిపారు.

## వెనిజులాపై దాడిని నిరసిస్తూ సీపీఎం ఆందోళన

- అమెరికా దురాక్రమణపై భారత్ స్పందించాలి : మచ్చ వెంకటేశ్వర్లు



**భద్రాచలం, జనవరి 5 ,ప్రజాజ్యోతి :** ఐక్యరాజ్యసమితి నిబంధనలను ఉల్లంఘిస్తూ వెనిజులాపై అమెరికా ఏకపక్షంగా దాడి చేసి, ఆ దేశ అధ్యక్షుడిని బందీగా చేసిందని ఆరోపిస్తూ, ఈ దురాక్రమణపై భారత్ స్పందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.సోమవారం సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వెనిజులాపై జరుగుతున్న అమెరికా దాడులను నిరసిస్తూ ప్లకార్డులతో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడారు.వెనిజులాలోని సహజ వనరులు, చమురు నిక్షేపాలపై కన్నేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మారక ద్రవ్యాల పేరుతో ఆ దేశంపై ఏకపక్షంగా దాడులు చేపట్టారని ఆయన ఆరోపించారు. ఐక్యరాజ్యసమితి సభ్యదేశమైన వెనిజులాపై అమెరికా దాడులు చేస్తున్నప్పటికీ ఐరాస ఇప్పటివరకు స్పందించకపోవడం దారుణమని అన్నారు.గతంలోనూ సామ్రాజ్యవాద విధానాలతో అనేక చిన్న దేశాలపై అమెరికా దాడులు చేసిందని గుర్తు చేశారు. లాటిన్ అమెరికా దేశమైన వెనిజులాపై ట్రంప్ ఏకపక్షంగా దాడులు చేస్తున్నా, భారత్ స్పందించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. వెనిజులాపై బాంబులతో దాడులు చేస్తూనే, భారత్‌పై మాటల దాడి చేస్తున్నారని ఆయన విమర్శించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ మాట్లాడగా, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి. నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు, పారెల్లి సంతోష్ కుమార్, డి. సీతాలక్ష్మి , పట్టణ కమిటీ సభ్యులు చొక్కా మాధవరావు, ఎస్. అజయ్ కుమార్, జ్యోతి జీవనజ్యోతి, చెట్ల శ్రీనివాసరావు, ఎస్‌డీ ఫిరోజ్, భూపేంద్ర, కోరాడ శ్రీనివాస్, కుంజా శ్రీను, వార్డు సభ్యురాలు ఇర్ప అనసూయ పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల అరెస్టులు అప్రజాస్వామికం టీపీటీఫ్ తీవ్ర నిరసన

- పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్



**ఆళ్ళపల్లి. జనవరి. 5. ప్రజాజ్యోతి:** తమ న్యాయమైన హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలపాలనుకున్న రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల అక్రమ అరెస్టులను తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఫ్) తీవ్రంగా ఖండించింది. అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో, ఉపాధ్యాయులను తెల్లవారుజామునే ఇళ్ల వద్ద అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడాన్ని టీపీటీఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు తప్పుబట్టారు.బకాయిల చెల్లింపు: 2024 నుండి రిటైర్ అయిన ఉద్యోగులకు రావాల్సిన పెన్షనరీ ప్రయోజనాలు, పెండింగ్ లో ఉన్న ఆర్థిక బిల్లులు మరియు (డిఏ )లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి.అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని, పోలీసులతో ఉద్యమాలను అణచివేయడం మానుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# గిరిజన మహిళలు స్వశక్తితో చిన్న పరిశ్రమలు నెలకొల్పాలి

- రూ.లక్ష విలువైన సామగ్రి పంపిణీ చేసిన ఐటీడీఏ పీవో బి. రాహుల్



**భద్రాచలం, జనవరి 5 ,ప్రజాజ్యోతి :** ఆదివాసి గిరిజన మహిళలు కష్టపడి స్వశక్తితో చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకొని, తమ జీవనోపాధిని మెరుగుపరుచుకోవడంతో పాటు మరింత మంది గిరిజన మహిళలకు ఉపాధి కల్పించే దిశగా ముందుకు సాగాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచించారు.సోమవారం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో చర్ల మండలం సున్నం గుంపు గ్రామానికి చెందిన శ్రీ ముత్యాలమ్మ జాయింట్ లయబిలిటీ గ్రూప్‌కు చెందిన ఆదివాసి గిరిజన మహిళలకు, ఇప్పపువ్వుతో వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేసేందుకు అవసరమైన రూ. లక్ష విలువైన సామగ్రిని ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పీవో రాహుల్ మాట్లాడుతూ గిరిజన మహిళలు సొంతంగా చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఇప్పపువ్వుతో ఇప్పపువ్వు లడ్డు, ఇప్పపువ్వు బర్ఫీ, ఇప్ప నూనె, పోషకాహార పదార్థాలు, అలాగే ఇప్పపువ్వుతో తయారయ్యే టీ పొడి, వివిధ రకాల పచ్చళ్లు తయారు చేసి విక్రయించడం అభినందనీయమని అన్నారు.ఇప్పటికే ఈ గ్రూపు మహిళలు పరిశ్రమలను విజయవంతంగా నిర్వహిస్తూ, శుభ్రత, నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ సరసమైన ధరలకు ఉత్పత్తులు విక్రయించడం వల్ల తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు పొందారని తెలిపారు. వీరు తయారు చేసిన ఉత్పత్తులు ఢిల్లీ వరకు విక్రయానికి చేరుకోవడం గిరిజన మహిళల శక్తికి నిదర్శనమని పేర్కొన్నారు.ఈ చిన్న పరిశ్రమలను ఇంతటితో ఆపకుండా, ఇప్పపువ్వుతో మరి న్ని కొత్త రకాల ఉత్పత్తులు తయారు చేసి మార్కెట్ విస్తరించితే లాభాలు మ రింత పెరుగుతాయని సూచించారు. ఇప్పపువ్వు సేకరణతో పాటు ఆహార పదార్థాల తయారీకి అవసరమైన సా మగ్రిని ఐటీడీఏ ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సహా య ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణ, గిరిజన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**భద్రాచలం, జనవరి 5 ,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని గిరిజన గురుకుల పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశాల కోసం, అలాగే 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కుమారి ఎస్. హేమలత ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గత నెల 11వ తేదీన ప్రారంభమైందని, జనవరి 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష రుసుముగా రూ.100ను ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు సమర్పించాలని సూచించారు.ఫిబ్రవరి 22వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు నిర్వహించబడతాయని వెల్లడించారు.ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాలు, అర్హతలు, నిబంధనల కోసం TGSET. CGG. GOV.IN వెబ్‌సైట్‌ను పరిశీలించాలని ప్రిన్సిపాల్ హేమలత కోరారు.

## దిశ దిన కర్మకు 50 కేజీల బియ్యాం వితరణ



**టేకులపల్లి,జనవరి05,ప్రజాజ్యోతి:** మండలంలోని సిసి రోడ్ బజార్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన భూక్య మోతి కుటుంబాన్ని దాస్ తండా నూతన సర్పంచ్ భూక్యచంద్ర సింగ్ రాథోడ్ పరామర్శించి, దిశా దిన కర్మకు ఆయన వంతుగా 50 కేజీల బియ్యాన్ని వితరణ చేశారు. భూక్య మోతి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత... మనందరి బాధ్యత

- పరిశుభ్రమైన గ్రామం ఆరోగ్యకరమైన భవిష్యత్తు
- ప్రతి సోమవారం హలో శుభోదయం శుభ్రత
- పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం....జగన్నాథ పురం సర్పంచ్ కుంజా వినోద్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ములకలపల్లి, జనవరి 05, ప్రజాజ్యోతి:** గ్రామం పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు ఉంటుందని జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్ అన్నారు. జగన్నాథపురం పంచాయతీ సర్పంచ్ కుంజా వినోద్ విన్నూతంగా తలపెట్టిన హలో శుభోదయం శుభ్రత పరిశుభ్రత కార్యక్రమాన్ని సోమవారం పంచాయితీ కార్యాలయం నుంచి రామాలయం వరకు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామం ఆరోగ్యంమే మన ఆరోగ్యం అని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హలో శుభోదయం కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకోని గ్రామ పంచాయితీ లో ప్రతి సోమవారం హలో శుభోదయం మన ఊరి – కోసం మన సర్పంచ్, శుభ్రత – పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించడం జరుతుందని తెలిపారు. అనంతరం రూ 5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు శంఖుస్థాపన చేసారు. నల్లవారిగూడెం గ్రామంలో బోరు బావి పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఇబ్రహీం, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు పామర్తి కృష్ణ. నాయకులు కొప్పుల రాంబాబు, బొల్లి పల్లి రమేష్, గుంటూరు సాయిరాం, కటారపు వెంకటరావు, మీడియం నారాయణ, బొడ్డప్ప, రామాచారి, యాకుబ్ పాషా, సున్నం నాగేష్, మడకం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# పేదవాడి పక్కా ఇల్లు కలే..

- ప్లాస్టిక్ కవర్ల నీడలో నిరుపేద కుటుంబం



**ఆళ్ళపల్లి. జనవరి5ప్రజాజ్యోతి:** ఆళ్ళపల్లి. నడిమిగూడెం పంచాయతీ లో గల.గోగ్గేల. నర్సింహారావు. దంపతులకు నేటి ప్రభుత్వ ఇల్లు మాకు అందేనా అని ఎదురు చూపు.తమకో సొంత ఇల్లు ఉండాలని, తన కుటుంబం తలదాచుకోవాలని ఆ దంపతులు కల... ప్లాస్టిక్ కవర్ల మాటున కన్నీరవుతోంది. ప్రభుత్వాలు మారుతున్నా, పథకాలు వస్తున్నా.. అర్హులైన తమకు మాత్రం 'పక్కా ఇల్లు' అందని ద్రాక్షగానే మిగిలిపోయిందని ఆ నిరుపేద కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది.అతుకుల బతుకు.. అగాధంలో ప్రాణం.ఫోటోలో కనిపిస్తున్న ఆ దృశ్యం పూరిపాక పైన గడ్డి పూర్తిగా పాడైపోవడంతో, అక్కడక్కడ పాత సిమెంట్ సంచులు, నల్లటి ప్లాస్టిక్ కవర్లు కప్పి ఎలాగోలా నెట్టుకొస్తున్నారు. వర్షం పడితే ఇంటి లోపల పరిస్థితి మొత్తం నానిపోయి ఉండటంతో, రాత్రిపూట నిద్రపోవాలంటే భయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఆ పూరి గుడిసెలు గడుపుతున్నారు.మా ఇల్లు ఎప్పుడు పూర్తవుతుందో ప్రభుత్వం నిరుపేదలందరికీ పక్కా ఇళ్లు ఇస్తామని హామీలు ఇస్తున్నా, క్షేత్రస్థాయిలో ఇలాంటి నిజమైన బాధితులకు ఇంకా న్యాయం జరగడం లేదు.కానీ మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేడు. అధికారుల చుట్టూ తిరిగినా 'వస్తుంది.. వస్తుంది' అన్న మాటే తప్ప మా అని బాధితులు వాపోతున్నారు.అర్హత ఉన్నా ఎందుకు నిర్లక్ష్యం.ఇంతటి దారుణమైన స్థితిలో ఉన్న కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చే ఇళ్ల పథకం వర్తించదా. క్షేత్రస్థాయి పరిశీలన ఏది సర్వేలు చేసే అధికారులు ఇలాంటి స్థితిలో ఉన్న ఇళ్లను ఎందుకు గుర్తించడం లేదు. ఈ కుటుంబానికి పక్కా ఇల్లు సామాన్యుడికి కనీస అవసరమైన 'గూడు' కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ఈ పేద కుటుంబం కంటున్న పక్కా ఇళ్ల కలను సాకారం చేసి, వారి కళ్లలో ఆనందం నింపాలని అధికారులను, ప్రజా ప్రతినిధులను వేడుకుంటున్నాము. మా ఆవేదన ఆలకించండి.. మా పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి. మాకు ఒక పక్కా ఇల్లు ఇప్పించి మా కుటుంబాన్ని కాపాడండి. బాధిత కుటుంబ విన్నపం.

## మనువాదానికి వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలి

- ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ పిలుపు



**భద్రాచలం, జనవరి 5 ,ప్రజాజ్యోతి :** మనువాదం అంటే మహిళలను అణిచివేయడమేనని, మహిళలకు ఏ విధమైన స్వేచ్ఛా హక్కులు లేకుండా కాలరాయడమే దాని అసలైన స్వరూపమని ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ అన్నారు. ఇలాంటి మనువాద భావజాలానికి వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని ఆమె పిలుపునిచ్చారు.సోమవారం భద్రాచలంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనం ఆవరణలో, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి. సీతాలక్ష్మి అధ్యక్షతన "మనువాదం – మహిళల హక్కులు" అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా సరళ మాట్లాడుతూభారత రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులు కల్పించిందని, శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిన ఈ కాలంలోనూ మహిళలను ఇంకా అణచివేయాలని చూడటం దుర్మార్గమని విమర్శించారు. సామాజిక మాధ్యమాల్లో కొందరు కావాలనే మహిళల వస్త్రధారణపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైనది కాదని, మరికొందరు తమను మేధావులమని చెప్పుకునే నాయకులు సైతం అలాంటి చర్యలకు వత్తాసు పలకడం శోచనీయమని అన్నారు.కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలపై, ముఖ్యంగా వారి వస్త్రధారణపై సామాజిక మాధ్యమాల ద్వారా దాడులు పెరిగాయని, అవి నేడు తారాస్థాయికి చేరాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలను ఒక వ్యాపార వస్తువులా చూడడమే కాకుండా, స్త్రీకి ఉన్న కళాపరమైన ఆసక్తులను బలహీనతగా మలిచి, సమాజం ముందు ఆమెను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సరళ ఆవేదన వ్యక్తం చేశారు.మహిళలపై జరుగుతున్న ఈ విధమైన దాడులు, వివక్షలకు వ్యతిరేకంగా సంఘటితంగా ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు.

# గ్రామ పంచాయతీ చేతిపంపు స్థలంలో ఆక్రమణ తొలగింపు

- బీఆర్ ఎస్ వార్డు సభ్యుని ఫిర్యాదుతో స్పందించిన పంచాయతీ అధికారులు

**భద్రాచలం, జనవరి 5 ,ప్రజాజ్యోతి :** భద్రాచలం పట్టణంలోని 7వ వార్డు సుభాష్ నగర్ కాలనీలో గ్రామ పంచాయతీకి చెందిన చేతిపంపు స్థలాన్ని ఓ ఇంటి యజమాని అక్రమంగా ఆక్రమించిన ఘటన చోటు చేసుకుంది.ఈ విషయాన్ని స్థానిక 7వ వార్డు సభ్యుడు కావూరి గోపి భద్రాచలం గ్రామ పంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణకు, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై వెంటనే స్పందించిన సర్పంచ్ పూనెం కృష్ణ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, ఆక్రమించిన చేతిపంపు స్థలానికి నిర్మించిన గోడను తొలగించారు.ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలైన చేతిపంపులు, ప్రభుత్వ స్థలాలపై ఎలాంటి ఆక్రమణలు సహించబోవని పంచాయతీ అధికారులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

